

టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.19
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.19, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,175 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.6°/21.1°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు కాస్త పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి చోటు



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో పలువురు జిల్లా వాసులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా ఎం. శంకరయ్య (రాప్తాడు), ఎస్.పి. ప్రశాంత్‌గౌడ్ (హిందూపురం), జి. పురుషోత్తంరెడ్డి (ధర్మవరం), జి. కుళ్లాయప్ప (ధర్మవరం), ఏ. శంకర్‌రెడ్డి (ధర్మవరం), పి.శ్రీనివాసులు (ధర్మవరం)ను నియమించారు. ఇక పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డి. భారతిరెడ్డి (పుట్టపర్తి)ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



ఆటో డ్రైవర్లకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం అందించే సాయాన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక సాయి ఆరామంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వం జిల్లాలోని 5,720 మంది ఆటో డ్రైవర్లకు మంజూరు చేసిన రూ 8,58 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందుతుందన్నారు. .ప్రతి ఆటో డ్రైవర్ క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడు కుటుంబాలు బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, రవాణా శాఖ అధికారి కరుణసాగర్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ రెడ్డి, పలువురు ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని వివిధ నియోజక వర్గాల్లో జరిగిన 'ఆటోడ్రైవర్ల సేవలో' కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో రెవెన్యూ ఉద్యోగులకు గాయాలు



తేనెటీగల దాడితో వీఆర్‌ఓ ఛత్రేనాయక్ చెవి, చేతులకు వాపు వచ్చిన దృశ్యం

వజ్రకరూరు: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలోని హంద్రీ–నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్ద శనివారం సాయంత్రం రెవెన్యూ ఉద్యోగులపై తేనెటీగలు దాడి చేశాయి. పలువురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొనకొండ్ల గ్రామానికి చెందిన ఎం.రామాంజినేయులు అనే వ్యవసాయ కూలీ నాలుగు రోజుల క్రితం ఛాయాపురం వద్ద ఉన్న హంద్రీ–నీవా ప్రధాన కాలువలో గల్లంతయ్యాడు. ఇప్పటికీ అతని అచూకీ లభించలేదు. దీంతో రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, వజ్రకరూరు పోలీసులు గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం వజ్రకరూరు తహసీల్దార్ నరేష్ కుమార్ నేతృత్వంలో ఆర్‌ఐ సతీష్‌కుమార్, విఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్ఏలు విజయ్, పెన్నయ్య, సుంకన్నతో పాటు మరికొందరు రెవెన్యూ ఉద్యోగులు ఛాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకు కాలువ వెంట గాలించారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అకస్మాత్తుగా తేనెటీగలు దాడిచేశాయి. వీఆర్వోలు ఛత్రేనాయక్, రంగస్వామి, వీఆర్‌ఎలు విజయ్, పెన్నయ్య, సుంకన్న తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే వజ్రకరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



ఇది ముదిగుబ్బ మండలం పీసీరేవు సమీపంలోని చిత్రం. చిత్రావతి నదిలో హిటాచీని దింపి ఇసుకను ఇలా తోడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నదికి తూట్లు పొడుస్తూ ఇసుకను తవ్వి తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఇసుకాసురులంతా పచ్చ నేతలే కావడం.. ప్రతి నెలా మామూళ్లు పంపుతుండటంతో యంత్రాంగం కళ్లుమూసుకుంది.

చిత్రావతిపై పచ్చ పడగ





బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి వద్ద జాతీయ రహదారి మీదుగా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

ఇసుక కోసం నదిని తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు

- జేసీబీలు, హిటాచీలతో రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా
- ఇతర ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షల అక్రమార్జన
- ముడుపులతో కళ్లుమూసుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు
- రూపురేఖలు కోల్పోయిన నదీ పరివాహక ప్రాంతం
- భూగర్భ జలమట్టం తగ్గి బోర్లు పనిచేయడం లేదని రైతుల గగ్గోలు

ధర్మవరం: తెలుగు తమ్ముళ్ల ధన దాహానికి చిత్రావతి నది చితికి పోతోంది. ఇసుక రీచ్‌లతో సంబంధం లేకుండా నదీ పరివాహక ప్రాంతాల్లో జేసీబీలు, హిటాచీలు పెట్టి మరీ అక్రమార్కులు ఇసుకను తోడుస్తున్నారు. ఆపై టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీస్, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఫలితంగా సమీప ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం దారుణంగా



ఇసుక భారీగా తవ్వడంలో చిత్రావతి నదిలో ఏర్పడిన భారీ గుంత

పడిపోయింది. బోర్లు పనిచేయక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ధర్మవరం ఇసుకకు ఫుల్ డిమాండ్

ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో నాణ్యమైన ఇసుక లభిస్తోంది. దీంతో ఇక్కడి ఇసుకకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న కర్నూలు, అనంతపురం, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో భారీ డిమాండ్ ఉంది. దీన్ని గుర్తించిన తెలుగు తమ్ముళ్లు ఇసుక రీచ్‌లతో పని లేకుండా దందాకు తెరలేపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అడ్డూఅదుపు లేకుండా చిత్రావతి పరివాహక ప్రాంతాల్లో ఇసుకను యంత్రాలతో తోడేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నారు.

ఊరూరా అక్రమ తవ్వకాలు

బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి, గరిశలపల్లి, రామాపురం చిత్రావతి బ్రిడ్జి సమీపంలోని పరివాహక ప్రాంతంలో పగలు, రాత్రి లేకుండా టీడీపీ నాయకులు జేసీబీలు, హిటాచీల ద్వారా ఇసుకను అక్రమంగా తవ్వుతున్నారు. అదేవిధంగా ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు, పీసీరేవు తదితర ప్రాంతాల్లో, తాడిమర్రి మండలం సీసీరేవు తదితర ప్రాంతాల్లో చిత్రావతి నది నుంచి ఇసుకను తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని చెన్నై జాతీయ రహదారి మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుకను ఇతర రాష్ట్రాల్లో అయితే రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం. జిల్లాలోని ఇతర ప్రాంతాలకైతే టిప్పర్ ఇసుక రూ.18 వేల వరకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక దూరాన్ని బట్టి రూ.1,200 నుంచి రూ.1,500 దాకా విక్రయిస్తున్నారు.

పట్టా భూములనూ వదలని వైనం

ఇసుకాసురులు చివరకు పట్టా భూములనూ వదలడం లేదు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు చెరువు, వాగుల వద్ద ఇసుక భారీగా తవ్వడంతో అక్కడ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో టీడీపీ నాయకులు చిత్రావతి పరివాహక ప్రాంతాల్లోని పట్టా సాగు భూముల్లోనూ తవ్వకాలు చేపట్టారు. సాగుభూముల్లోని ఇసుకను తోడవద్దని రైతులు ఎంత మొరపెట్టుకుంటున్నా కనికరించకుండా దౌర్జన్యం చేస్తున్నారు.

రీచ్ లేకపోవడంతో...

ప్రభుత్వం జిల్లాలోని ఉప్పలపాడు, పీసీ రేవు వద్ద, తాడిమర్రి మండలం సీసీరేవు వద్ద ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసింది. అయితే ఈ ఏడాది జూన్ నెలాఖరుతో రీచ్‌ల గడువు ముగిసింది. ఆ తర్వాత రెన్యూవల్ చేయకపోవడంతో ఆ రీచ్‌లు బంద్ అయ్యాయి. ఈ పరిణామం తమ్ముళ్లకు వరంగా మారింది. ప్రజలు కూడా ఇసుక కోసం అక్రమ రవాణా చేసే వారినే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారు చెప్పిందే ధర, పంపిందే ఇసుక అన్న విధంగా పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక గతంలో నియోజకవర్గంలోని రెండు ఇసుక రీచ్‌ల ద్వారా రోజూ సగటున రూ.30 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరేది. ఆ ఆదాయం తమ్ముళ్ల జేబుల్లోకి వెళ్తోంది.

మామూళ్ల మత్తులో అధికారులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణా అరికట్టడం కోసం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచింది. దీంతో అప్పట్లో ఇసుక అక్రమ రవాణాకు అవకాశమే ఉండేది కాదు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులను తూర్పారబడుతూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు ప్రతినెలా మామూళ్లు పెద్ద మొత్తంలో అందుతుండటంతో వారు ఇసుక అక్రమ రవాణా వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదపుటంచున ప్రయాణం



ఆటోకు వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు

కదిరి అర్బన్: దసరా సెలవులు ముగియడంతో ఊర్లకు వెళ్లిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు తిరుగు పయనమయ్యారు. శనివారం కదిరిలో ఆటోడ్రైవర్లతో ఎమ్మెల్యే కందికుంట సమావేశం నిర్వహించారు. దీనికి పలువురు ఆటోడ్రైవర్లు హాజరుకావడం, అదే సమయంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా ఎక్కువగా లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఆటోల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్లారు. ప్రమాదపుటంచున ప్రయాణం సాగించారు. కదిరి కోర్టు రోడ్డులో ఒకే ఆటోలో 25 మంది వరకు విద్యార్థులు కిక్కిరిసి ప్రయాణించారు.

ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవాలి

- అగ్నిమాపకశాఖ డీజీ వెంకటరమణ



మాట్లాడుతున్న డీజీ వెంకట రమణ

అనంతపురం: ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) పి. వెంకటరమణ అన్నారు. శనివారం జేఎన్‌టీయూ (ఏ)లోని ఆడిటోరియంలో జోన్–4 పరిధిలోని శ్రీ సత్య సాయి, వైఎస్సార్‌కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన అగ్నిమాపక శాఖ అధికారులు, సహాయ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి జిల్లాలోని అగ్నిమాపక సదుపాయాల స్థితిగతులపై ఆరా తీశారు. వాహనాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాల అవసరంపై చర్చించారు.

ఉల్లి రైతుల గోడు పట్టదా బాబూ?

- కొంటామని మాటిచ్చి, చేతులెత్తేస్తారా?
- కూటమి సర్కార్‌పై ఉషశ్రీచరణ్ మండిపాటు
- మద్దతు ధర కల్పించాలని రైతులతో కలిసి ధర్నా



సానిపల్లిలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

రొద్దం: దళారులకు మద్దతు తెలుపుతున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు పండించే రైతులను నిండా ముంచుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. ముఖ్యంగా ఉల్లి రైతు గోడు చంద్రబాబు పట్టడం లేదన్నారు. శనివారం ఆమె మండలంలోని సానిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల కల్లాల్లో ఉన్న ఉల్లిని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి పెట్టుబడి...దిగుబడి...ప్రస్తుతం మార్కెట్‌లో ధర గురించి ఆరా తీశారు. పెట్టుబడి కూడా దక్కడం లేదని తెలిసి రైతులతో కలిసి గొబ్బురంపల్లి–సానిపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేట్టారు. ఉల్లి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతును రాజుగా చూడాలని ఆకాంక్షించారని, నేడు చంద్రబాబు హయాంలోనే కూటమి సర్కార్ రైతును రోడ్డున పడేసేందుకు సిద్ధమైందన్నారు. దళారులకు పెద్దపీట వేస్తూ రైతులను దగా చేస్తోందన్నారు. ఫలితంగా గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రైతుల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కరువైందన్నారు. ఉల్లి మొదులుకుని టమాట, మొక్కజొన్న తదితర ఏ పంటకూ మద్దతు ధర దక్కక రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. అలాగే ఉల్లి రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకునే వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ తిమ్మయ్య, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, సోమందేపల్లి మండల కన్వీనర్, స్థానిక ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, చిలకల రవి, పలువులు ఎంపీటీసీలు, స్థానిక నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఖాద్రీశా.. కరుణించవయా..!

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనారసింహుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, వైఎస్సార్ కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



పూజలందుకున్న లక్ష్మీనారసింహుడు

యూరియా కోసం తప్పని తిప్పలు



రొద్దం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో రైతుల పడిగాపులు



పోలీసు భద్రత నడుమ యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

- రొద్దంలో తెల్లవారుజాము నుంచే క్యూలో రైతుల పడిగాపులు
- మంత్రి సవిత ఇలాకాలో అన్నదాతలకు అష్టకష్టాలు

రొద్దం: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. రెండు నెలలుగా బస్తా యూరియా కోసం రైతులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఇక ఈ నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా ఉన్న సవిత అన్నదాత ఆక్రందన వినిపించుకోవడం లేదు. ఫలితంగా రైతులు ఎప్పటిలాగే పంటల సాగుకు అవసరమైన యూరియా కోసం బారులు తీరుతూనే ఉన్నారు.

సగం మందికి కూడా అందలేదు

రొద్దంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని గ్రామాల రైతులకు శనివారం యూరియా పంపిణీ చేస్తున్నట్లు అధికారులు ముందుగానే ప్రకటించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు శనివారం తెల్లవారుజామునుంచే పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బారులు తీరారు. గంటల తరబడి వేచి చూశారు. అయినా అధికారులు రైతుకు రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. దీంతో సగం మంది రైతులకు యూరియా అందలేదు. వారంతా కూటమి సర్కార్‌పై దుమ్మెత్తి పోశారు. మంత్రికి కూడా తమ కష్టాలు పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పీఏసీఎస్ సీఈఓ వెంకటేసులు మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం 280 బస్తాల యూరియా వచ్చిందని, శనివారం 140 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశామని తెలిపారు.

ఇబ్బందులు పడుతున్నాం



పంటలకు ఇప్పుడు యూరియా చాలా అవసరం. రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరినా యూరియా దొరకడం లేదు. రోజూ యూరియా కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో పనులు కూడా చేసుకోలేక పోతున్నాం. పంట పండించే రైతులకు కనీసం యూరియా కూడా ఇవ్వలేరా...? – సినిమా నారాయణ, రైతు, రొద్దం

జిల్లా కేంద్రంలోనే ఇంత అధ్వానమా?

- మునిసిపాలిటీ దుస్థితికి 123వ ర్యాంకు అద్దం పడుతోంది
- కౌన్సిల్ అత్యవసర సమావేశంలో సభ్యుల మండిపాటు
- ప్రొటోకాల్ ఉల్లంఘనలపై నిలదీత
- వార్డుల పెంపునకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి

పుట్టపర్తి టౌన్: ''రోడ్డుపై మురుగు పారుతోంది. ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. మౌలిక సదుపాయాలు అధ్వానంగా ఉన్నాయి. ఇది జిల్లా కేంద్రం అని చెప్పుకునేందుకు సిగ్గుగా ఉంది. సత్యసాయి శత జయంతి ఉత్సవాలు సమీపిస్తున్నా... అధికారులు మేల్కోవడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వల్ల 'స్వచ్ఛ సర్వేక్షన్'లో పుట్టపర్తికి 123వ ర్యాంక్ దక్కింది. గతంలో రాష్ట్రంలోనే 4వ ర్యాంక్ సాధించిన పుట్టపర్తికి... ఇప్పుడు 123 ర్యాంక్ రావడం ఏమిటి.. ఈ ర్యాంక్‌ను బట్టి అధికారుల పనితీరు అర్థమవుతోంది'' అంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అధికారుల పనితీరును తూర్పారబట్టారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోవాలని హితవు పలికారు. శనివారం మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన, కమిషనర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ... తమ వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని... ఎన్నిసార్లు చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు సమీపిస్తున్నాయని, భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ప్రొటోకాల్ కూడా పాటించరా..?

అనంతరం వైస్ చైర్మన్ తిప్పన్న మాట్లాడుతూ... అధికారులు కనీసం ప్రొటోకాల్ కూడా పాటించడం లేదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కౌన్సిలర్లను ఆహ్వానించడం లేదని, కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. కానీ అభివృద్ధి పనుల ఆమోదం కోసం మాత్రం తాము కావాల్సి వచ్చామా..అంటూ కమిషనర్‌ను నిలదీశారు. దీంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నచౌదరి కలుగజేసుకుంటూ... మర్యాదలేనప్పుడు రాజీనామా చేయాలన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లంతా ఆయనపై ధ్వజమెత్తారు. తమను ప్రజలు గెలిపించి కౌన్సిల్‌కు పంపారని, ఇలా ఎవరు పడితే వారు రాజీనామా కోరడం తగదన్నారు. అసలు తమను రాజీనామా చేయాలని కోరే హక్కు నీకెక్కడ ఉందంటూ రత్న చౌదరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో కౌన్సిల్ కాసేపు రసాభాసగా మారింది. మిగిలిన కౌన్సిలర్లు సర్దిచెప్పడంలో అందరూ శాంతించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి మాట్లాడుతూ... ప్రొటోకాల్ పాటించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్న కౌన్సిల్ చైర్మన్‌గా తన అధికారం తాను ఉపయోగిస్తానని హెచ్చరించారు. ఇక నుంచైనా ప్రొటోకాల్ పాటిస్తూ కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రొటోకాల్ తప్పకుండా పాటిస్తామన్నారు. వీధిలైట్లు కూడా తీసుకొచ్చామని, బాబా శతజయంతి ఉత్సవాలకు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజనకు ఆమోదం

పట్టణం జిల్లా కేంద్రంగా మారడంతో పాటు జనాభా, కాలనీలు పెరిగిన దృష్ట్యా వార్డుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో వార్డుల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 27కు పెంచాలని తీర్మానించగా..కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

క్లుప్తంగా

నేత్రదానం


నాగరాజు (ఫైల్)

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి, ఆదర్శంగా నిలిచారు. కియా ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు... ధర్మవరం మండలం ఓబుల నాయునిపల్లికి చెందిన నాగరాజు (33) కియా పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేసే వాడు. గురువారం మధ్యాహ్నం విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా కియా మెయిన్ గేట్ ఎదురుగా ఉన్నా స్పీడు బ్రేకర్ల వద్ద అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. నాగరాజు శుక్రవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు మెడికల్ కళాశాలకు తరలించారు. కుటుంబ సభ్యులు డిస్ట్రిక్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీకి మృతుని నేత్రాలను దానం చేశారు. నాగరాజుకు భార్య వనజ, కుమారులు గగన్, ప్రమోద్ కుమార్ ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం

- కుమారునికి తీవ్ర గాయాలు


మృతి చెందిన చింతలరాయుడు (ఫైల్)

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు .. తాడిమర్రి మండలం పుల్లంపల్లికి చెందిన గోనుగుంట్ల రాజశేఖర్, తన తండ్రి గోనుగుంట్ల చింతల రాయుడు (65)తో కలిసి శుక్రవారం బత్తలపల్లికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లికి వెళ్లే క్రాస్ వద్దకు రాగానే ముందు వెళుతున్న తాడిమర్రి మండలం పుల్లానారాయణపల్లి గ్రామానికి చెందిన పుల్ల ఆదినారాయణరెడ్డి సడెన్‌గా బైక్‌ను కుడివైపు తిప్పాడు. దీంతో రెండు వాహనాలూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చింతల రాయుడు, కుమారుడు రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చింతలరాయుడును మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. కుమారుడు రాజశేఖర్ శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

అనధికార పశువధశాలల గుట్టురట్టు


అనధికార పశు వధశాలలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ, సీఐలు


పశువులను వధించడానికి ఏర్పాటు చేసిన షెడ్లు

- పోలీసులు, మున్సిపల్ అధికారుల ఆకస్మిక దాడి
- సీజ్ చేసిన పశువులను గోశాలకు తరలింపు

హిందూపురం: అనధికారిక పశువధశాలల గుట్టు రట్టయ్యింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి పశువులను గోశాలకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. హిందూపురానికి చెందిన కొంతమంది వ్యాపారులు మోతుకుపల్లిలో అక్రమంగా పశువధశాలలు నిర్వహిస్తున్నారు. పశువుల మాంసం విక్రయించడంతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని కొందరు వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రంగంలోకి దిగారు. మున్సిపల్ అధికారులతో కలిసి అనధికారిక పశువధశాలలపై దాడి చేశారు. అక్కడ వధించడానికి పెద్ద సంఖ్యలో ఉంచిన ఎద్దులు, ఆవులు, దూడలను గుర్తించారు. పోలీసులను మోహరించి... ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 87 పశువులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం పశువులను ఉంచిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ పేర్చి ఉన్న పశువుల చర్మం, నిల్వ ఉంచిన మాంసం గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం అనధికారిక వధశాలలను తొలగించామన్నారు. అయినా వ్యాపారులు గుట్టుగా మళ్లీ వధ శాలలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ స్లాటర్ అండ్ యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్ 1977 ప్రకారం ఏదైనా పశువును వధించాలంటే వ్యవసాయానికి, పాల ఉత్పత్తికి, సంతానోత్పత్తికి సరికాదని అన్ని పరీక్షలు చేసి నిర్ధారించిన తర్వాతే వైద్య పరీక్షలతో అధికార అనుమతితో ధ్రువీకరణ చేసి వధించాల్సి ఉంటుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి పశువులను, వాటి పిల్లలను ఇలా తెచ్చి కట్టి వధించడం నేరమన్నారు. స్వాధీనం చేసుకున్న పశువులను గోశాలకు పంపామన్నారు. పట్టుబడిన పశువులు ఉన్న ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీటిని వధించి వ్యాపారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో అనధికారికంగా వధశాలలు నిర్వహిస్తూ జంతువ్యర్థాలు అక్కడే పడవేస్తూ అనారోగ్యం పాలు చేస్తున్నారని ఎవరైనా అభ్యంతరం తెలిపితే నిర్వాహకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు చేస్తారని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం


సదస్సులో ఐక్యత చాటుతున్న బీసీ నేతలు

- బీసీ నేతల పిలుపు

అనంతపురం అర్బన్: హక్కుల సాధన, జనాభా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. జనగణనలోనే కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాలులో కుల, ప్రజాసంఘాలతో సదస్సు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసరి శంకర్ రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం సలీమ్, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, కురబ సంఘం తరపున మాజీ మేయర్ రాగే పరశురాం, బీసీ సంక్షేమ సంఘం తరపున వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదా గాంధీ, తదితరులు మాట్లాడారు. కులగణన ద్వారానే బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. కర్ణాటక, తెలంగాణ తరహాలో రాష్ట్రంలోనూ కులగణన చేపట్టిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కులగణన పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనధికారికంగానే బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబు తమది బీసీల ప్రభుత్వమని జపం చేస్తూనే.. మరోవైపు కులగణన చేపట్టడానికి మాత్రం ముందుకు రావడం లేదన్నారు. కులగణన డిమాండ్‌తో 'చలో అమరావతి' చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అవసరమైతే చలో ఢిల్లీ నిర్వహిస్తామన్నారు. సదస్సులో సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, వడ్డెర సంఘం నాయకుడు వడ్డే జయంత్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎస్ఆర్ నాగభూషణం, బహుజన సమాజ్ పార్టీ నాయకులు శ్రీరాములు, మైనారిటీ నాయకులు మైనుద్దీన్, నాయకులు సంజీవప్ప, శ్రీరాములు, కేశవరెడ్డి, పద్మావతి, లింగమయ్య, రమణయ్య, రాజేష్, సంతోష్‌కుమార్, కుళ్లాయి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నంది విగ్రహం చోరీ కేసు ఛేదింపు

- నలుగురు గుప్త నిధుల వేటగాళ్ల అరెస్ట్


ధ్వంసం చేసిన నంది విగ్రహాన్ని సీఐ, ఎస్ఐలతో కలసి పరిశీలిస్తున్న డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెల వద్ద ఉన్న పురాతన శివాలయంలోని నంది విగ్రహం చోరీ కేసును పోలీసులు ఛేదించారు. విగ్రహం ఎత్తుకువెళ్లిన గుప్తనిధుల వేటగాళ్లలో నలుగురిని అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ శనివారం చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా బడవనహళ్లికి చెందిన మధుసూదన్, న్యూ ఎస్టేట్‌కు చెందిన దీపక్‌శెట్టి, చిత్రదుర్గం జిల్లా మొలకాల్మూరు తాలూకా తుమకూర్లహళ్లికి చెందిన భానుప్రసాద్, తుమకూరు జిల్లా చేలూరుహోబ్లి తాలూకా సి.హరివేసాంద్రాకు చెందిన చందన్‌తో పాటు మరికొందరు గుప్తనిధుల వేటగాళ్లు. వీరు గుప్త నిధుల కోసం సెప్టెంబర్ నాలుగో తేదీ ముష్టికోవెల వద్ద ఉన్న శివాలయంలోని నంది విగ్రహాన్ని చోరీ చేశారు. బొలెరో వాహనంలో విగ్రహాన్ని తుమకూరు జిల్లా పావగడ తాలూకా వీర్లగుడి గ్రామ సమీపంలో ఉన్న మారెమ్మగుడి వద్ద ఉన్న బావి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నంది విగ్రహం ముఖం, గోపురం, వెనుక తోక భాగం పగులగొట్టారు. చోరీ ఘటనకు సంబంధించి గ్రామస్తుడు ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం న్యామద్దెల సమీపంలోని బుల్లెట్ కంపెనీ వద్ద నలుగురు నిందితులు మధుసూదన్, దీపక్‌శెట్టి, భానుప్రసాద్, చందన్ ఉన్నట్లు పక్కా సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా.. నేరం ఒప్పుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచినట్లు డీఎస్పీ తెలిపారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కేసును ఛేదించిన పీఎస్ఐ గౌతమి, పోలీసులు పోతన్న శ్రీరాములు, సంజీవరాయుడు, షాకీర్, దస్తగిరి, నవీన్‌ను డీఎస్పీ అభినందించారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఏవైనా ఘటనలు జరిగినపుడు నిందితులను త్వరగా పట్టుకునేందుకు వీలవుతుందని డీఎస్పీ ప్రజలకు సూచించారు.

వ్యభిచార గృహంపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఓ వ్యభిచార గృహంపై శనివారం పోలీసులు దాడి చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు దాడి చేసి.. వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఎదురెదురుగా కార్లు ఢీకొనడంతో ఘటన


విడపనకల్లు వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం




కోమాలోకి వెళ్లిన లావణ్య భర్త సుధీర్, కుమారుడు ఉదయ్, చికిత్స పొందుతున్న సంజీవ్‌రెడ్డి


మృతి చెందిన లావణ్య

విడపనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయారు. విడపనకల్లు శివారులో శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైజాగ్‌కు చెందిన సుధీర్ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీలో పని చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. అనంతపురంలో నివాసం ఉంటున్నారు. దసరా పండుగ అనంతరం కుటుంబంతో కలిసి సరదాగా హంపికి వెళ్లాలనుకున్నారు. శనివారం మధ్యాహ్నం అనంతపురం నుంచి సుధీర్ తన భార్య లావణ్య (34), కుమారుడు ఉదయ్‌తో కలిసి శనివారం హంపికి కారులో బయల్దేరాడు. ఇక గోవా నుంచి సంజీవ్ రెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్యనాయుడు, నాగిరెడ్డి అనంతపురానికి కారులో వస్తున్నారు. విడపనకల్లు శివారులోని పెట్రోలు బంకు సమీపంలో రెండు కార్లు అదుపుతప్పి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు నుజ్జు నుజ్జవడంతో లోపల ఉన్న వారంతా కాళ్లు, చేతులు విరిగి కోమాలోకి వెళ్లిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఉరవకొండ సీఐ మహానంది, విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తమ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కార్లలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను స్థానికుల సహాయంతో అతికష్టం మీద బయటకు తీసి ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో లావణ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం సంజీవ్‌రెడ్డి, పుల్లయ్య నాయుడు, శ్రీనివాసులు, నాగిరెడ్డిలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్యులెక్కడ...?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకువస్తే కంటి వైద్యులు తప్ప మిగిలిన డాక్టర్లు, సూపరింటెండెంట్, సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేరు. పోలీసులు, స్థానికులు, కొంతమంది చారిటబుల్ ట్రస్టు సభ్యులు వైద్యులకు సహాయ సహకారాలు అందించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలోని 50 పడకల ఆస్పత్రిలోనే వైద్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం దారుణమని స్థానికులు వాపోయారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి

విడపనకల్లులో పెట్రోలు బంకు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కెంగూరి ఎర్రిస్వామి, సీపీఎం నాయకులు రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బోయ వెంకటేశులు తెలిపారు. ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టనట్టు ఉంటున్నారని మండిపడ్డారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

లైంగికంగా వేధిస్తున్నాడనే హత్య

- వీడిన యువకుడి అనుమానాస్పద మృతి మిస్టరీ
- ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


హత్యకు గురైన అమర్‌నాథ్ (ఫైల్)


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

నల్లచెరువు: అల్లుగుండు గ్రామానికి చెందిన అమర్‌నాథ్ (24) అనుమానాస్పద మృతి మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహితను లైంగికంగా వేధిస్తుండటంతో ఆమె భర్త, మరో ఇద్దరి సహకారంతో అమర్‌నాథ్‌ను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నాగేంద్ర మీడియాకు వెల్లడించారు. అల్లుగుండు గ్రామానికి చెందిన షేక్ దాదాపీర్, అమర్‌నాథ్ స్నేహితులు. ఈ క్రమంలో దాదాపీర్ తరచూ అమర్‌నాథ్ ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఓ రోజు దాదాపీర్ ఇంట్లో లేని సమయంలో అమర్‌నాథ్ వచ్చాడు. అప్పుడు ఆమె బాత్రూమ్‌లో ఉండగా.. అమర్‌నాథ్ సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. అనంతరం తన కోరిక తీర్చాలని, లేకుంటే వీడియో అందరికీ పంపుతానని బ్లాక్‌మేల్ చేశాడు. భార్య ద్వారా విషయం తెలుసుకున్న దాదాపీర్ తన స్నేహితులైన కుమ్మరవాండ్లపల్లికి చెందిన సాదిక్‌బాషా, కదిరికి చెందిన మహమ్మద్ యాసిన్‌లకు చెప్పి.. అమర్‌నాథ్ ను ఎలాగైనా హతమార్చాలనుకున్నాడు. పథకం ప్రకారం 2023 జూన్ పదో తేదీ రాత్రి 11 గంటల సమయంలో మాట్లాడాలని బాలప్పగారి పల్లి వద్దనున్న గుట్టవద్దకు ఆటోలో తీసుకెళ్లారు. అక్కడ అమర్‌నాథ్‌ను రాళ్లతో కొట్టి అతి హతమార్చారు. అనంతరం తాడుతో కాళ్లకు బండరాయి కట్టి తవళంమర్రి పంచాయతీ పరిధిలోని రిజర్వాయర్ కాలువ నీటిలో పడేసి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులను పోలీసులు గుర్తించారు. పోలీసులు ఇక తమను వదలరని గ్రహించిన ముగ్గురు నిందితులు దాదాపీర్(ఏ1), మహమ్మద్ యాసిన్ (ఏ2), సాదిక్‌బాషా(ఏ3), శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఏ ఒక్క హామీ అమలు చేయలేదు

కదిరి అర్బన్: అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సకాలంలో డీఏలు, పీఆర్సీ నియమించి మధ్యంతర భృతి ఇస్తామని తదితర హామీల్లో ఏ ఒక్కటీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్‌లాజమ్ ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 7న విజయవాడలోని ధర్నా చౌక్‌లో వేలాదిమంది ఉపాధ్యాయులతో చేపట్టే ధర్నాకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడతల వారీగా ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని, బోధనేతర పనులు రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమిత్తం చేస్తామని చెప్పి ఇంతవరకూ చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో మెమో 57 అమలులో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జవహర్, ఆంజనేయులు, రమేష్, ఆదిబయన్న, రాజశేఖర్, నారాయణ, తాహిర్‌వలీ, హనీఫ్‌ఖాన్, వెంకటేష్‌బాబు, చాంద్‌బాషా, షర్ఫుద్దీన్, మౌలాలి, వెంకటాచలమయ్య, హతావుల్లా, ఈదుల్లా, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం


అగ్నిగుండం వద్ద భక్తుల రద్దీ


వీరభద్రస్వామిని అలంకరించిన దృశ్యం

అగళి: మధూడి గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి అగ్నిగుండ మహోత్సవం వైభవంగా జరిగింది. మూల విరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చి అగ్నిగుండంలో ధూపం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ధూపం వేయడం వల్ల కష్టాలు తొలుగుతాయనేది భక్తుల నమ్మకం. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన లింగదబీరప్ప స్వాముల నృత్యంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బ్రహ్మరూపానికి అరటి కొమ్మలు అగ్నిగుండం వద్ద నాటి కొమ్మలు నరికి బలిదానం చేశారు. పురోహితులు ఉపవాసంతో అగ్నిగుండంలో ఉన్న నిప్పును తమ జోళిలో వేయించుకుని స్వామి వారి మూలవిరాట్ వద్దకు తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులు అగ్నిగుండంలో నడిచారు. పురోహితుల ఇంటి నుంచి కలశంతో పాటు లింగదబీరులను ఊరేగింపుగా జంబి వృక్షం వద్దకు తెచ్చి పూజలు చేశారు. అనంతరం దేవాలయంలో పట్టం కూర్చోబెట్టారు.

ఓపెన్ చెస్ టోర్నీ సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న టోర్నమెంట్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఈశ్వరప్ప

ధర్మవరం అర్బన్: తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని హైబ్రో చెస్ అకాడమీ ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఈశ్వరప్ప, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు, అధ్యక్షుడు చాంద్‌బాషా, కార్యదర్శి జాకీర్ హుసేన్ కోరారు. పట్టణంలోని కొత్తపేట ఉషోదయ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 8, 9 తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ రుసుం రూ.600 ఉంటుందన్నారు. నవంబర్ 8వతేదీ ఉదయం 8గంటల్లోపు ఎంట్రీఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 99126 47370, 08559-221813 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి మోహన్, వైకే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.